తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 29 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3

# రేషన్ కార్డా..కాంగ్రెస్ ఐడీ కార్డా..?



## బీఆర్ఎస్ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్

- కాంగ్రెస్ రంగులు, సీఎం, మంత్రి ఫొటోలతో ఎలా ముద్రిస్తారు
- ప్రభుత్వ కార్డుపై లబ్ధిదారుల ఫొటో, వివరాలు ఉండాలి
- ప్రభుత్వం మారితే ఆ కార్డు ఉంటుందా
- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజావారధి/మోత్కూరు**

కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పేరుతో లబ్ధిదారులకు ఇస్తున్నవి రేషన్‌కార్డులా లేక కాంగ్రెస్ ఐడీ కార్డులా అని బీఆర్ఎస్ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాధనంతో ఇస్తున్న రేషన్‌కార్డులపై కాంగ్రెస్ రంగులు, సీఎం, మంత్రి ఫొటోలు ముద్రించి ఎలా ఇస్తారని, ప్రభుత్వం మారితే ఈ కార్డులు ఉంటాయా అని ప్రశ్నించారు. ప్రజాధనంతో ఇస్తున్న ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారుల ఫొటోలు, కుటుంబ సభ్యులు వివరాలు ఉంటాయని, ప్రభుత్వ రాజముద్రతో ఇస్తారని, కానీ ప్రభుత్వం ఇస్తున్న కార్డులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గుర్తింపు కార్డుల్లా ఉన్నాయని, ఇది ముమ్మాటికీ ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనన్నారు. ప్రతి పథకానికి రేషన్‌కార్డే ప్రామాణికమని, పేదలు దేనికైనా దరఖాస్తు చేసుకోవడానికి కుటుంబ సభ్యుల వివరాలు ఉండాలంటే ఆ కార్డు మళ్లీ జిరాక్స్ సెంటర్లకు తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకోవాల్సిందేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ లక్షల రేషన్‌కార్డులు ఇచ్చారని, వాటిపై లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలు, రాజముద్రతోనే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడం చేతగాక ప్రభుత్వ సొమ్ముతో ఇలాంటి చిల్లర పబ్లిసిటీ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్, దళితబంధు, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ ఇలా ఏ ప్రభుత్వ పథకం అమలు చేసినా కేసీఆర్ ప్రభుత్వ అధికారిక రాజముద్రతోనే ఇచ్చారని, ఇప్పుడు మీలా ఏం చేయకున్నా ఫొటోలు వేసుకోలేదన్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెంచి ఇస్తున్న కొన్ని లక్షల పింఛన్ కార్డులపై కూడా ఫొటోలు లేకుండానే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను ఇప్పటికే చాలా వాటిని రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్లు పెంచి ఇవ్వాలని, రైతులకు ఎగ్గొట్టిన రైతుబంధు ఇవ్వాలని, రద్దు చేసిన రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకాలను, దళితులకు ఇస్తామన్న రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
మంగళవారం
జనరల్ న్యూస్
29 - 09 - 2026


# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ప్రజావారధి/శాలిగౌరారం

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ సర్పంచ్ సకినాల వరలక్ష్మినర్సయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎం.జ్యోతి అన్నారు. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, సమతుల్య ఆహారంతోనే శిశు మరణాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలపాక శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్లు జి.అమృత, చిలుకూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# వల్లాల మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజావారధి/ శాలిగౌరారం

శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన పేరమండ్ల శేఖర్ మృతి చెందగా సోమవారం సర్పంచ్ భూపతి తిరుపతమ్మ ఉపేందర్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగి దావీదు, జాల శంభయ్య, రాగి లక్ష్మణ్, భూపతి మహేష్, వెంకీ, పేరమండ్ల శంకరయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మార్కెట్ యార్డ్ కు చెందిన నిరుపేద రూపని అనసూర్య ఇటీవల మృతి చెందగా శాలిగౌరారంకు చెందిన పలువురు ఆ కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు కల్లూరి నాగరాజు రూ.5 వేలు, 8వ వార్డ్ మెంబర్ బల్లెం సత్తమ్మవెంకటయ్య 50 కిలోల బియ్యం, రాపాక రాజు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బల్లెం ఉదయ్ కుమార్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మల సురేష్, మాజీ సర్పంచ్ బట్ట హరితవీరబాబు, కల్లూరు లింగయ్య, బండారి ధనుంజయ్, కంది వీరసోములు, సీపీఎం సీనియర్ నాయకులు కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, మాక్క బుచ్చి రాములు, తాటిపాముల జనార్ధన్, తందారి సతీష్, బట్ట గణేష్ తదితరులు పాల్గొన్నారు.